రాజావారి ఎడమకన్ను

గొబ్బూరు వేంకటానంద రాఘవ రావు గారు బి.ఏ,

పూర్వకాలమునం దొకదేశమును చంద్రసేనుడనురాజు పరిపాలించుచుండెను అతడు తన సేవకులయందును భాగ్యవంతులయందును పక్షపాతముకలవాడై వారల మాటలే నిజములనినమ్మి వారు చెప్పినట్లే నడుచుకొనుచుండెడివాడు ఆసంగతి కనిపెట్టి ఆదేశమునందలి ధనవంతులును, రాజ్యసేవకులును పేదలను బహువిధముల పీడింపజొచ్చిరి శ్రీమంతులు తమపలుకులకెదురాడ సాహసించిన పేదలపైని, సాధులపైని లేనిపోనినేరములుకల్పించి రాజునెదుట ఫిర్యాదులుచేయుటయు, వారలమాటలే సత్యములనిభావించి రాజు అమాయకులను అక్రమముగా దండించుచుండుటయు సంభవించుచుండెను ఫిర్యాదువిచారణచేయునపుడు రాజావారికుడి ప్రక్కను ఫిర్యాదియు ఎడమప్రక్క నేరస్థులును నిలుచుండుట ఆదర్బారులోపద్ధతియైయుండెను. ఎడమప్రక్కనిలుచుండి మొఱపెట్టుకొను పేదలమాటలుపాటింపక రాజుగారు వాండ్రను క్రూరముగా దండించుచుండుటచేత ఎడమప్రక్కవారిపని ఫైసలైనదని ప్రజలనుకొని నిరుత్సాహులై దుఃఖించుచుండిరి

ఆరాజ్యములో నొకయూర పెద్దకమతముగల రైతుగలడు వానిపేరు గోవిందరాజు వానికి ముగ్గురు కూతుండ్రుండిరి. పెద్దది లక్ష్మి రెండవది దుర్గ మూడవది భారతి. అందరిలో వయసునచిన్నదైనను విద్యాబుద్ధులయందు భారతి పెద్దదనియే చెప్పవలెను తండ్రికి భారతియందు ఎక్కువముద్దు, గౌరవము కలవు.

గోవిందరాజొకనాడు కొన్ని పశువులను సంతకుతోలించుచు, కూతుండ్రనుబిలిపించి "అమ్మా! పశువులతో నేను పట్నంవెళ్ళుచున్నాను. మీకేమికావలెనోచెప్పండి తీసుకొనివస్తాను "అనెను లక్ష్మి "నాయనా! నాకు కాళ్ళకువెండిపట్టీలు- మన పొరుగుసీతమ్మ చేయించుకున్న పట్టీలవంటివి- కావలెను మచ్చుచూపించెదను ఉండు"మనిచెప్పి, వెంటనే పొరుగింటికివెళ్ళి సీతమ్మపట్టీలుతెచ్చి చూపించెను "సరే-తే-"అని గోవిందరాజు రెండవకూతురునుపిలిచి "అమ్మాయీ! దుర్గా! నీకేమికావలెను?" అనియడిగెను "నాకు రాజేశ్వరి చేతులకున్న మోస్తరు గాజులజత తెచ్చిపెట్టుము" అని తక్షణమే దుర్గ తనస్నేహితురాలగు రాజేశ్వరియింటికి పోయి, ఆమెను పిలుచుకొనివచ్చి తనకుకావలసినగాజులెటువంటివో తండ్రికిమచ్చుచూపించెను "సరె నీకు ఇటువంటిగాజులజత కొనితెచ్చెదనులే తల్లీ! భారతీ! నీకేమికొనితెత్తునే?"అని గోవిందరాజు మూడవకూతునడిగెను "నాయనా! నాకు పట్టీలు, గాజులు, నగలు అక్కరలేదు నాకుకావలసినది వేరేఒకటియున్నది అదితెచ్చుట చాలకష్టము ప్రమాదముకూడను అందువల్ల మీకు చాలాబాధలుకూడ కలుగవచ్చును కనుక మీతోచెప్పుటకు సందేహించుచున్నాను"అని భారతి ప్రత్యుత్తరమిచ్చెను. "తల్లీ! నీవెప్పుడును నాకిదికావలె, అది కావలె-అనినన్నుపీడించుదానవుకావు. కన్నతండ్రిని, నాదగ్గర సంశయ మేలనమ్మా? ఏమిప్రమాదించినను, ఏమి బాధలు కలిగినను నేను లక్ష్యముచేయను అవసరమైనయెడల నాప్రాణమిచ్చి నీయభీష్టము తీర్చెదను సంశయింపక చెప్పు"మని తండ్రి ఆమెను ప్రోత్సాహించెను

"అలాగైతే, నాన్నగారూ! మీరు తక్కినపశువులను మీయిష్టమువచ్చినట్టు అమ్మకొండి కాని దోరపెయ్యనుమాత్రం డబ్బుకుఅమ్మకండి ఏమియిమ్మన్నావు ఈపెయ్యకు? అని ఎవరైనా అడిగితే నేను డబ్బుకు అమ్మను. మనరాజావారి ఎడమకన్ను ఎవరుతెస్తే వాళ్ళకీదోరపెయ్యనమ్ముతాను లేకపోతే అమ్మను అని ఖండితంగాచెప్పండి. అందునుగురించి ఎవరివల్లనైనా ఏమైనా చిక్కువస్తే తక్షణం నాకు కబురు పంపండి నేనువచ్చి సర్దుకుంటాను." అని చెప్పినది భారతి ముద్దులకూతు రీవింతకోరిక కోరినందుకు గోవింద

రాజు మిక్కిలి యక్కజపడెను. కాని భారతి చాలబుద్ధిమంతురాలు ఏచిక్కులువచ్చినను క్షణములో విడదీయగల సామర్థ్యము ఆబాలికకడ లేకపోలేదు. చూత మ్మీ చిత్రమేమోనని తండ్రిఅందు కంగీకరించి యిల్లు బయలుదేరెను

పట్టణము చేరినతరువాత సంతలో నాతడు దోరావునుతప్ప తక్కినపశువులనన్నింటిని అమ్మివేసెను. తరువాత పెద్దకూతురుకోరిన వెండిపట్టీలను, చిన్నకూతురుకోరిన బంగారుగాజులుకొని యింటికిపంపించెను. పిమ్మట దోరావును సంతలోపెట్టి శ్రీరాజావారిఎడమకన్నిచ్చి యీదోరావును కొనవచ్చు నని బహిరంగముగా ప్రకటింపజొచ్చెను

"డబ్బో, గింజలో కోరక రాజావారియెడమకన్ను కావలెనంటూ డీదోరపెయ్యకు-ఇదేమి? వీనికి పిచ్చియెత్తినదా?" అని శ్రోత లబ్బురపడుచుండిరి. తుద కీవృత్తాంతము రాజభటుల చెవిసోకనది వారు పరుగునవచ్చి గోవిందరాజునుపట్టుకొని-"అరే- భడవా? నీకు రాజావారిఎడమకన్నుకావాలా? వెన్నుబద్దలు కావాలా? పదపద నీరోగము చప్పగాకుదురుతుంది" అని రెక్కలువిరిచికట్టి గెంటుచు రాజసముఖమున కీడ్చుకొనిపోయి, ఎదుటబెట్టి "మహాప్రభూ! వీడు మనపట్టణములో పశువుల సంతకు ఒకగొడ్డావును తోలుకొనివచ్చినాడు డబ్బుకు అమ్మడట! ఏలినవారి యెడమకన్ను తెచ్చినవారికి వీడాదోరపెయ్యనమ్మతాడట ఇంతపొగరెక్కియున్నాడు ఈరాజద్రోహినేమిచేయుమని సెలవు?"అని యడిగిరి,

"మహాప్రభూ! నేను రాజద్రోహినిగాను, నాఅంతటనేనై యీలాగున చెప్పలేదు. నాకు ముగ్గురు ఆడపిల్లలు. కడసారపుది భారతి మంచితెలివితేటలుకలది అదే యీదోరపెయ్యను ఏలినవారి ఎడమకంటి కమ్మకొమ్మని నన్నుకోరినది దాని అభిప్రాయమేమో నాకును తెలియదు. ఏచిక్కులువచ్చినను వెంటనే కబురంపినయెడల తానువచ్చి విప్పుదునని చెప్పినది. ఆపిల్లమాట చెల్లించుటకే నేనిలాగుచేసినాను. అంతయు స్పష్టముకాగలదు. వెంటనే మాభారతిని రప్పింపు"డని గోవిందరాజు ఏలినవారితో సవినయముగా మనవిచేసుకొనెను

ఈసంగతి యేమో తెలుసుకొందమని రాజావారు కొందరంతఃపురపరిచారికలతో రాజభటులను, పల్లకిబోయీలను గోవిందరాజు నింటికిపంపి భారతిని తత్క్షణము కొనితెమ్మనిరి

౨

వచ్చినదిభారతి - సాక్షాద్భారతివలె - రాజసభకు - చూచినాడామెను పరికించి - చంద్రసేనుడు - "శౌర! ఈబాలిక నాఎడమకంటికి తనయింటి గొడ్డావుకు సమపెట్ట సాహసించినది " అని రాజాగ్రహ పరవశుడై, "ఏమే పిల్లా! నీకన్ను లింతపొరలుగ్రమ్మినవా? మీగొడ్డావునకు నాయెడమకన్ను సమజేసి సంతలో పెట్టించితివా? ఏమిసంగతి? చెప్పు"మని గద్దించియడిగెను భారతి సవినయముగా "మహాప్రభూ! నాకను లేమి పొరలుగ్రమ్మలేదు. ఈవింతసంగతివిని ఏలినవారు నన్ను తమసముఖమునకు తప్పకపిలిపింతురనియు, ఈవిధముగా నాకు రాజదర్శనలాభము కలుగుననియును ఊహించియే మాతండ్రినట్లుకోరితిని."

రాజు —మాదర్శనము నీకేల?

భారతి —మహాప్రభూ! మీకును, మీ రాజ్యమునకును, మీప్రజలకును మిక్కిలి యావశ్యకమును, అత్యంత క్షేమకారియునైన హితవొకటి వెంటనే మనవి చేయవలసియున్నది. అది తమదర్శనము చేసుకొని నేను స్వయముగా చేయవలసినమనవి. ఆయవకాశము లభింపచేసుకొనుటకు నేను మాతండ్రి నిందుకు నియమించినాను

రాజు —ఏమిటామనవి?

భారతి —మహాప్రభూ! చెప్పుచున్నాను చిత్తగింపుడు సత్యముగనుక నిర్భయముగా మనవిచేయుచున్నాను. మీరాజ్యములో శ్రీమంతులు, ధనవంతులు, మీసేవకులు ఆడినదాట, పాడినదిపాట వారిమాటలు వేదవాక్కులు వారేమిచెప్పిన నదేనిజమని తమరునమ్ముచున్నారు పేదలగోల విసరు. వారిద్ర దురవస్థచూడరు మీకుడివైపున నిలిచినవారిమీదనే మీదృష్టి. ఎడమవైపున నిలిచినవారిగతి కని పెట్టరు మీఎడమకన్నుండియు లేనట్లయినది మాపసువులలో దోరావుగొడ్డుది నిరర్థకములైన ఒగారెంటిని సమపెట్టుట ధర్మమనిమాగొడ్డావుకు మీయెడమకంటినిమ్ము్ంటిని

ఎత్తిపొడిచి నిజముచెప్పినది భారతి కోపమతిశయించినది రాజునకు సత్యంపరంధీమహి. నిర్భయముగ నిజముపలికి చలింపకనిలిచిన యాబాలికసాధురూపము రాజును కలవరపెట్టజొచ్చెను నిశ్చేష్టుడైప్రభుడు కొంతతడవూరకుండవలసివచ్చెను పిదప మంత్రితో మంతనముచేసి కొంటెప్రశ్నలుకొన్నివేసి ఆమెను భంగ పుచ్చదలచి క్రమ్మఱరాజిట్లనియె "బాలికా! నీతెలివితేటలెట్టివో పరీక్షించి నీసంగతి తెలిసికోవలెను నిన్ను మేము కొన్నిప్రశ్నలడుగదలచినాము నీవుసరిగా ప్రత్యుత్తరములిచ్చినసరి లేకున్న నిన్ను క్రూరముగా దండింతుము - ముందుగా ఆకాశముమీదనున్న నక్షత్రములసంఖ్య ఎంతో సరిగా చెప్పుము"

భారతి —మహాప్రభూ! మనపట్టణసముద్రతీరమున నిసుకరేణువులెన్నిగలవో సరిగా అన్నినక్షత్రములే ఆకాశముననున్నవి

రాజు —ఎవరు ఎక్కువమందిఉన్నారు? చచ్చినవాళ్లా? బ్రతికియున్నవాళ్లా?

భారతి —మహాప్రభూ! బ్రతికున్నవాళ్లే ఎక్కువమంది - చచ్చినవాళ్లు ఉండనేఉండరు. ఉండేవాళ్లయితే వాళ్ళు చచ్చినవాళ్ళలో జమకానేరరు

రాజు —ఈభూమికి మధ్యనేమున్నది?

భారతి —తమరాజ్యము - తమపట్టణము తమకోట-తమసభ - తక్కినన్నియు తమచుట్టునున్నవి.

రాజు —మా రాజ్యము అందుగల చరస్థిరరూపకమయిన యావత్తు సరిగా ఎంతవెలచేయును?

భారతి —ఈప్రశ్నకు సరిగా జవాబు చెప్పుదును కాని ముందుగా తమరొకఖరారుచేయవలెను మూడు రోజులు తమరు నేను చెప్పినట్లునడుచుకోవలెను అందుకు మీరంగీకరించినపక్షమున మీప్రశ్నకు సదుత్తరమువచ్చును

రాజు —ఈలోపుగా మాఖజానాలెక్కలు, కోటలు, పేటలు, భూములు కిమ్మతుకట్టించి కూడిచెప్పుదువు కాబోలు?

భారతి —లేదు-లేదు-మీఖజానాలు, కోటలు, పేటలు, భూములు, బుట్టలు, లెక్కలు నాకేమక్కరలేదు- మీ ఉద్యోగస్థులు నాదగ్గరకు రానక్కరలేదు. నేను వారెవరితో మాటలాడుదానను గాను.

రాజు మరియు నక్కజపడజొచ్చెను. "ఎవరితో మాటలాడక, లెక్కలుగట్టక యీకొమరాలు నా రాజ్యపువిలువ తెల్పునట! దీనిసంగతియంతయు బహువిచిత్రముగానున్నది-కానిమ్ము చూతము" అనుకొని, "సరే - నేను మూడురోజులు నీవుచెప్పినట్లే నడుచుకొందును నీవిచటనేయుండుము." అనెను

భారతి —చిత్తము-మహాప్రభూ! నేనట్లేయుండెదను తమరుమాత్రము సత్యముతప్పక నేడును, రేపును- ఏమియు తినకూడదు. మంచినీళ్లయిన త్రాగకూడదు. శుష్కోపవాసముండవలెను ఎల్లుండిఉదయము సమస్తము తమకు స్పష్టముకాగలదు

3

భారతితో చేసిన ఖరారు తప్పకుండ రాజురెండుపవాసములుచేసెను భారతి రాజాంతఃపురమునందే నివసించియుండెను. మంత్రిసామంతాదులెవరును భారతితోగాని రాజుగారితోగాని ప్రసంగింపలేదు.

మూడవనాడు తెల్లవారినది రాజునకు స్వరము హీనమయ్యెను నీరసము భరింపరాకుండెను కనులును, శరీరమును మండుచున్నట్లుండెను. ఆకలి దహించుకొని పోవుచుండెను. దాహముచే నోరెండిపోవుచుండెను. క్షుత్పిపాస లెంతదారుణముగా క్రూరముగా మనుజులను పీడించునో స్వానుభవముచే రాజునకు లెస్సగా బోధపడెను భారతి ఉదయము తొమ్మిదిగంటలకు రాజుగారికి వంటచేయించి, పీటవేయించి బంగారుకంచములోపట్టెడన్నముపెట్టించి, చెంబునిండనీళ్లుపోయించెను అపుడు ప్రభుని భోజనమునకు వేంచేయుమనెను "బ్రతుకు జీవుడా" అనుకొని రాజు పీటమీదకువచ్చెను. భారతి 'ఆగు" మనెను రాజుగుండెలలో రాయిపడెను ఇది మరేమితంటా తెచ్చిపెట్టుచున్నదోయని రాజుభయపడెను. అపుడు భారతి "మహాప్రభూ! తమరాజ్యము వెలయెంతో మనవిచేయుమని నాకాజ్ఞాపించినారు మీరాజ్యమంతయు నిపుడీపట్టెడన్నమునకు, ఈచెంబెడు నీళ్ళకు సరికాదు- ఇంతకుతక్కువేనని నేనుచెప్పుచున్నాను ఏమందురు?" అని ప్రశ్నించెను

రాజు "నాప్రాణము లెగిరిపోవుచున్నవి నీవుచెప్పినట్లు నారాజ్యమంతయు నిపుడీయన్నము నీళ్లపాటి చేయదు. ఇందుకదంతయు తీసికట్టే-తక్కువ-చాలతక్కువ-ముమ్మాటికితక్కువ ఇకనైననన్ని మెతుకులుతిన నిచ్చి యీనీళ్ళుత్రాగి పడియుండనిమ్ము" అనుచు భోజనమారంభించి, ఆయన్నముతిని నీళ్ళుత్రాగి యుస్సురనుచు విశ్రమించిలేచెను.

అపుడాతడు భారతినిపిలిపించి సగౌరవముగా నిట్లనియెను· "అమ్మా! భారతీ! నారాజ్యములో నాలోపముచే జరుగుచున్న అధర్మవ్యాప్తియు, అందువలన ప్రజలలో పెరుగుచున్న అశాంతిని నాకు స్ఫుటముగా గోచరింపచేసితివి అధోగతి పాలుకాకుండ నన్నును, నాశనముకాకుండ నారాజ్యమును కాపాడి రక్షించితివి కనులుండియు గ్రుడ్డివాడనై రాజధర్మచ్యుతుడనై ఉన్న నన్ను, ద్యుమత్సేనుని సావిత్రివలె సముద్ధరించి పుణ్యముకట్టుకొంటివి నీవునాకు ధర్మోపదేశముచేయవచ్చిన పరదేవతవని భావించుచున్నాను. నీవు నాకు కోడలివై రాజ్యక్రమమునడుపుము ధర్మహానిగాకుండ కాపాడుము. ప్రజలసంతోషమే రాజ్యమునకు పునాది-ప్రజాతుష్టి బడయనిరాజ్యము త్వరలో భగ్నమైపోవును నారాజ్యములో ప్రజాసామాన్యమునకు కలుగుచున్న పీడ నీవుసాహసించి చమత్కారముగా నాకు తెలిపి మహోపకారము చేసినందుకు నీబుద్ధివిశేషము కొనియాడుచు ఎంతోకృతజ్ఞుడనైయుండెదను."

పిమ్మట చంద్రసేనుడు భారతిని తనకుమారునికి వివాహముచేసి, ఆమెసాయముగొనుచు ధర్మగ్లాని కాకుండ ప్రజాహితముగ రాజ్యపరిపాలనముచేసెను. పల్లెటూరిలో పేదరైతు కూతురై పుట్టినభారతి బుద్ధిబలముచే రాజాహ్వానముబడసి, సత్యమునాశ్రయించి, రాజ్యధ్వంసముగావింపనున్న యధర్మమును నశింపజేసి మహారాజుకోడలైనది. "క్రియాసిద్ధి సత్వేభవతి మహతాంనోపకరణే" మహాత్ములైనవారు అవసరమైన సాధనసంపత్తిలేకున్నను ప్రజ్ఞచేతను, బుద్ధిబలముచేతను సమస్తమునుసాధించి కార్యసాఫల్యముపొందుదురు

రాధారాధనము

పండితముదిగొండకోటయ్యశాస్త్రిగారు

ఆలమందలు జెవులెత్తి యాలకింప
మైమఱచిగోపకులమెల్ల మసలుచుండ
మోళ్ళుచివురించి యంతట మొగ్గలీన
నాకసంబునఁ జనుపక్షు లబ్బెనిలువ
హర్షపులకితగాత్రులై యమరులెల్ల
"నమృతమానాఁడు విషముతో నమరెమనకు
నేటియమృతంబె స్వచ్ఛమై నిక్కమైన"
దనుచుఁ దనివోనిమనముల నారగింప
రాలుగరుగంగ లోకముల్ రంజిలంగఁ
బూతకాళిందికాతీరపుణ్యభూమి
శ్యామలతమాలపాదపచ్ఛాయలందు
ముంగురులుఫాలతలమును మూసివైవఁ